ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



తమిళనాడు
TAMILNADU
గురువారం 24 ఏప్రిల్ 2025



శాసనసభలో మౌనం పాటిస్తున్న ఎమ్మెల్యేలు

'పహల్గాం' మృతులకు అసెంబ్లీ నివాళి

● స్టాలిన్, ఈపీఎస్ సంతాపం

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ లోయలో పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన పర్యాటకులకు నివాళులర్పిస్తూ రాష్ట్ర శాసనసభ సంతాపం ప్రకటించింది. మృతుల కుటుంబీకులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ప్రధాన ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రగాఢ సంతాపం ప్రకటిస్తూ ప్రసంగించారు.

బుధవారం ఉదయం శాసనసభ ప్రారంభం కాగానే స్పీకర్ అప్పావు కశ్మీర్ లోయలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ, ఆ దాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి నివాళులర్పిస్తూ చేసిన సంతాప తీర్మానాన్ని చదివారు. ఆ తర్వాత స్పీకర్ సూచన మేరకు మృతులకు నివాళులర్పిస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు, శాసనసభ్యులంతా లేచి నిలబడి రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

అనంతరం స్టాలిన్ మాట్లాడుతూ.... కశ్మీర్ లోయలో అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని హతమార్చటం పైశాచిక చర్యగా అభివర్ణించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. అమాయకులను పొట్టనబెట్టుకునే ఉగ్రవాద సంస్థలను ఇక ఏమాత్రం ఉపేక్షించకుండా ఉక్కుపాదంతో అణచివేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇక రాష్ట్రానికి చెందిన కొందరు పర్యాటకులు ఆ దాడుల్లో గాయపడినట్లు తనకు సమాచారం అందిందని, వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నారని, అదే సమయంలో కశ్మీర్‌లోయలో చిక్కుకున్న తమిళుల సమాచారం తెలుసుకుందుకు హెల్ప్‌లైన్ ఫోన్ నెంబర్లు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కశ్మీర్ పర్యటనకు వెళ్లిన తమిళులందరినీ క్షేమంగా స్వస్థలానికి చేర్చేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. పుదుకోట జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి అబ్దుల్‌రసూల్‌ను కశ్మీర్ వెళ్లి బాధితులను స్వస్థలానికి చేర్చే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించానన్నారు. దేశంలో ఉగ్రవాదానికి తావులేదని, ఇలాంటి ఉగ్రవాద చర్యలను అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలకు తాము అండగా ఉంటామని స్టాలిన్ ప్రకటించారు.

ఈపీఎస్ ఖండన...

ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద సంస్థలపై పోరు సల్పాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి సౌందర్యాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులపై కాల్పులు జరిపి హతమార్చిన ఉగ్రవాదులను గుర్తించి వారికి కఠినశిక్షలు పడేలా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన 26 మంది కుటుంబాలకు పార్టీ తరపున ఈపీఎస్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

కశ్మీర్‌లో మనోళ్లు క్షేమమే

● ముగ్గురికి మాత్రం గాయాలు
● స్వస్థలానికి 28 మంది తరలింపు
● హెల్ప్‌లైన్ల ఏర్పాటు
● కోవై, చెన్నై నగరాల్లో పోలీసుల తనిఖీలు



చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకుల లగేజీ తనిఖీ చేస్తున్న పోలీసులు

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో అనంతనాగ్ జిల్లాలో ఉగ్రవాదుల దాడి నుంచి రాష్ట్రానికి చెందిన పర్యాటకులు తృటిలో తప్పించుకున్నారు. అయితే ముగ్గురు మాత్రం గాయపడగా, తక్కిన వారంతా క్షేమంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రం నుండి కశ్మీర్ పర్యటనకు వెళ్ళిన 28 మంది తమిళులందరిని స్వస్థలానికి చేర్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కశ్మీర్ నుండి అందరిని క్షేమంగా స్వస్థలానికి చేర్చేందుకుగాను ఐఏఎస్ అధికారి అబ్దుల్‌రసూల్‌ను పంపారు. అదే సమయంలో కశ్మీర్‌లో చిక్కుకున్న తమిళుల సమాచారం తెలుసుకునేందుకు 011-24193300 (ఫోన్ నెంబర్), 9289516712 (సెల్, వాట్సప్) అనే రెండు హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని తమిళనాడు హౌస్ అధికారులు కశ్మీర్ లోయ నుండి రాష్ట్రానికి చెందిన పర్యాటకులను సురక్షితంగా చేర్చే పనుల్లో ఇప్పటికే తలమునకలయ్యారు.

కాల్పుల్లో ముగ్గురికి గాయాలు..

ఉగ్రవాదుల దాడి సంఘటనలలో రాష్ట్రానికి చెందని ముగ్గురు పర్యాటకులు గాయపడ్డారు. చెన్నైకి చెందిన డాక్టర్ పరమేశ్వరన్ (31), ఇతర ప్రాంతాలకు చెందిన శాంటోనా (83), బాలచంద్ర (57) గాయపడ్డారు. వీరిలో శాంటోనా తీవ్రంగా గాయపడి స్పృహతప్పిపడిపోవటంతో చికిత్స నిమిత్తం అక్కడి ఆసుపత్రికి తరలించారు. ఇక డాక్టర్ పరమేశ్వరన్‌కు ఉదరంపై గాయమైంది. పహల్గాం ఆసుపత్రిలో ఆయనకు చికిత్స అందిస్తున్నారు.

రాత్రంతా లాడ్జిల్లో తనిఖీలు..

కశ్మీర్‌లోయలో ఉగ్రవాదులు నరమేధానికి పాల్పడిన నేపథ్యంలో రాజధాని నగరం చెన్నై, వాణిజ్యనగరం కోయంబత్తూరులో మంగళవారం సాయంత్రం నుండి లాడ్జీలు, మేన్షన్లలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. మసీదులు, క్రైస్తవాలయాల వద్ద పోలీసులు నిఘా వేశారు. రెండు నగరాల్లోనూ ఉగ్రవాద నిరోధక విభాగం, క్యూ బ్రాంచ్, సెంట్రల్ క్రైం విభాగం తదితర విభాగాల పోలీసు ఉన్నతాధికారులంతా సమన్వయంగా ఈ తనిఖీలను నిర్వహించారు. నగరంలో మంగళవారం రాత్రంతా పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. కమిషనర్ అరుణ్ ఆదేశాల మేరకు అడిషనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనుర్లు, సీఐలు కలిసి నగరమంతటా రాత్రి 10 నుండి బుధవారం వేకువజాము నాలుగు గంటల వరకు లాడ్జిలు, రెస్టారెంట్లు,, మేన్షన్లలో తనిఖీలు జరిపారు. అదే సమయంలో ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల సోదా కూడా జరిపారు. సెంట్రల్ రైల్వేస్టేషన్, ఎగ్మూరు రైల్వేస్టేషన్, తాంబరం రైల్వేస్టేషన్ కోయంబేడు, కిలాంబాక్కం, మాధవరం బస్‌స్టేషన్ల వద్ద పోలీసులు, రైల్వే పోలీసులు ప్రయాణికుల కదలికలపై నిఘా వేశారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్నవారిని అదుపులోకి తీసుకుని విచారించిన తరువాత వారిని విడిచిపెట్టారు. ఇదేవిధంగా కోయంబత్తూరు నగరం, ఆ నగర శివారు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం నుండి పోలీసులు తనిఖీలు ప్రారంభమయ్యాయి. సుమారు వెయ్యి మంది సాయుధ పోలీసులు లాడ్జీలు, రెస్టారెంట్లు, మేన్షన్లలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఉత్తరాదికి చెందినవారెవరైనా బసచేస్తున్నారా అని ఆరా తీశారు. ఆ నగరంలోని ప్రముక దేవాలయాలు, చర్చిలు, దర్గాలు, మసీదుల వద్ద పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. రాత్రి 9 గంటల నుండి బుధవారం వేకువజాము 5 గంటల దాకా సుమారు వెయ్యిమంది పోలీసులు ప్రధాన కూడళ్ల వద్ద నిఘావేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

స్వస్థలానికి మరో 68 మంది...

మదురై నుండి కశ్మీర్‌కు విహారయాత్రకు వెళ్ళిన 68 మంది అర్ధాంతరంగా యాత్ర ముగించుకుని స్వస్థలానికి బయలుదేరుతున్నారు. కశ్మీర్‌లోయలో ఉగ్రవాదుల దాడిలో 26 మంది మరణించారని తెలుసుకున్న పర్యాటకులు స్వస్థలానికి పయనమయ్యారు. వీరందరూ శుక్రవారం మదురైకి తిరిగొస్తారని అధికారులు తెలిపారు.



కొవ్వొత్తులు వెలిగించి కాశ్మీర్ మృతులకు అంజలి ఘటిస్తున్న టక్కర్‌బాబు పాఠశాల విద్యార్థులు

అవన్నీ అవాస్తవాలు

● ఆ సమావేశం ప్రభుత్వానికి పోటీ కాదు
● వీసీలతో భేటీపై రాజ్‌భవన్ వివరణ



చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ఉన్నత విద్యా సంస్థల ప్రతినిధులతో ఈ నెల 26వ తేదీ గవర్నర్ భేటీ కావడంపై మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వానికి-రాజ్‌భవన్‌కు మధ్య జరుగుతున్న అధికార పోరాటంలా ఆ సమావేశాన్ని చిత్రీకరిస్తున్నాయని రాజ్‌భవన్ ఆరోపించింది.. ఇది ఏమాత్రం పోటీ భేటీ కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం రాజ్‌భవన్ ప్రకటన విడుదల చేసింది. 2022 నుంచి ప్రతి ఏడాది ఏప్రిల్‌లో ఉన్నత విద్యా సంస్థల ప్రతినిధుల వార్షిక సమావేశాలను గవర్నర్ నిర్వహిస్తున్నారని రాజ్‌భవన్ గుర్తు చేసింది. ఈ సమావేశాల్లో తమిళనాడు సహా దేశంలో వున్న విద్యా, పారిశ్రామిక ప్రముఖులు పాల్గొని తమ అనుభవాలను పంచుకుంటారని పేర్కొంది. రాష్ట్ర విద్యార్థుల ప్రయోజనాల కోసమే ఈ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. గతంలో ఎన్నడూ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు పరస్పరం ఆలోచనలను పంచుకోలేదని పేర్కొంది. ఇది విద్యార్థులకు ప్రతికూలత, హాని చేకూరుస్తుందని అభిప్రాయపడింది. ప్రతి సంవత్సరం సమావేశానికి సన్నాహాలు చాలా నెలల ముందుగానే ప్రారంభమవుతాయని, ఇందులో భాగంగానే జనవరిలోనే ఈ సమావేశాలను ఖరారు చేసినట్లు వివరించింది. వాస్తవం ఇలా ఉండగా... ఇటీవల సుప్రీంకోర్టు తీర్పును అనుసంధానిస్తూ, రాజ్‌భవన్‌తో రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య అధికార పోరాటంగా కొన్ని మీడియా సంస్థలు చిత్రీకరించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో రూపొందించిన చట్టాల మేరకు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఛాన్స్‌లర్ అయ్యారు. ఆ వెంటనే ఆయన యూనివర్శిటీల వైస్‌ఛాన్స్‌లర్లతో భేటీ ప్రభుత్వ ఆలోచనలు వివరించి, దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో హఠాత్తుగా ఢిల్లీ వెళ్లిన గవర్నర్.. ఉపరాష్ట్రపతితో భేటీ అయిన అనంతరం ఈ నెల 26న ఊటీలో వీసీలతో సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అంతేగాక ఆ సమావేశానికి ఉప రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరవుతారని గవర్నర్ పేర్కొన్నారు.

● టాస్మాక్‌లో ఈడీ తనిఖీల వ్యవహారం...

హైకోర్టులో ప్రభుత్వానికి చుక్కెదురు

● పిటిషన్ల తోసివేత

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆకస్మిక దాడులను చట్టవ్యతిరేకమైన చర్యగా ప్రకటించాలని కోరుతూ టాస్మాక్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్లను హైకోర్టు తోసిపుచ్చింది. టాస్మాక్ సంస్థలో చట్టవ్యతిరేకంగా నగదు బట్వాడా జరిగినట్లు ప్రాథమిక సాక్ష్యాధారాలు లభించటం వల్లే తనిఖీ చేసారనే ఈడీ వాదనలను హైకోర్టు సమర్థించింది. నుంగంబాక్కంలోని టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మార్చి 6 నుండి 8వ తేదీ వరకు నిర్విరామంగా 60 గంటలపాటు తనిఖీలు చేసి కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తనిఖీల సందర్భంగా ఆ సంస్థలో రూ.1000 కోట్లకు పైగా అవినీతి అక్రమాలు జరిగిందని వెల్లడైనట్లు ఈడీ ఓ ప్రకటన కూడా చేసింది. ఈ నేపథ్యంలో ఈడీ తనిఖీలు చట్ట వ్యతిరేకమని ప్రకటించి, తదుపరి చర్యలు చేపట్టకుండా స్టే విధించాలని కోరుతూ టాస్మాక్, రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరుగా పిటిషన్లు వేశాయి.. ఈ పిటిషన్లపై న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణియం, కె.రాజశేఖర్‌తో కూడిన హైకోర్టు ధర్మాసనం ఆరు రోజులపాటు విచారణ జరిపింది. ఇరుపక్షాల వాద ప్రతివాదనలు ముగియటంతో ధర్మాసనం బుధవారం ఉదయం తీర్పు వెలువరించింది. చట్టవ్యతిరేకమైన నగదు బట్వాడా దేశ ఆర్థిక ప్రగతిపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఈ నేరాన్ని తేలికగా పరిగణించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ తనిఖీలు రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా జరిగాయని పిటిషనర్లు చేస్తున్న ఆరోపణలను సమర్థించలేమని, తమకు సంబంధించినంతవరకూ తగిన సాక్ష్యాధారాలున్నాయా లేదా అన్నది మాత్రమే పరిశీలించి తీర్పు ఇస్తామని స్పష్టం చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చేస్తున్న ఆరోపణలకు ప్రాథమిక సాక్ష్యాధారాలుండటం వల్ల ఈ రెండు పిటిషన్లను తోసిపుచ్చుతున్నట్లు పేర్కొంది. అదే సమయంలో ఈ అవినీతిపై ఈడీ అధికారులు తదుపరి చర్యలు చేపట్టడానికి కూడా తమకెలాంటి అభ్యంతరాలు లేవని తేల్చిచెప్పింది.



తంజావూరులో చిత్తిరై ఉత్సవాల ప్రారంభం

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శైవక్షేత్రం తంజావూరు బృహదీశ్వరాలయంలో చిత్తిరై ఉత్సవాలు బుధవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ చిత్తిరై ఉత్సవాలు 18 రోజులపాట నిర్వహించనున్నారు. ధ్వజారోహణం సందర్భంగా బుధవారం ఉదయం చంద్రశేఖరస్వామి, పంచమూర్తుల సమేతంగా సర్వాలంకరణ శోభితుడై పల్లకిలో ఆలయ వెలుపల ప్రాకారంలో ఊరేగుతూ ధ్వజస్తంభం ఎదుట కొలువుదీరారు. ఆలయ అర్చకులు ధ్వజస్తంభానికి పూజలు చేసి, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ప్రధానార్చకులు ధ్వజారోహణం చేశారు. బుధవారం సాయంత్రం 6.30 గంటలకు పంచమూర్తులు పడిచట్రంలో ఊరేగుతూ ఆలయంలోకి చేరుకున్నారు. ఆ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం 8 గంటలకు వినాయకస్వామి పల్లకీలో ఊరేగనున్నారు. సాయంత్రం వినాయకస్వామి సింహ వాహనంలో ఊరేగనున్నారు. ఆ తర్వాత ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం చంద్ర శేఖర స్వామివారు వివిధ వాహనాల్లో ఊరేగి భక్తులకు కనువిందుచేస్తారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన మహారథోత్సవం మే 7న జరుగనుంది. ఈ నెల 10న తీర్థవారీతో ఈ ఉత్సవాలు పూర్తికానున్నాయి. ఆ రోజు వృషభవాహనంలో పంచమూర్తులు ఊరేగింపు జరుగుతుంది. సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగియనున్నాయి.



బృహదీశ్వరాలయం ఎదుట ధ్వజారోహణం చేస్తున్న శైవపండితులు, ప్రధానార్చకులు

మంత్రి దురైమురుగన్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ

● అక్రమార్జన కేసు విచారణకు ఉత్తర్వులు



ప్యారీస్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అక్రమార్జన కేసుకు సంబంధించి డీఎంకే ప్రధాన కార్యదర్శి, జల వనరుల శాఖామంత్రి దురైమురుగన్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. 1996వ సంవత్సరం నుంచి 2001 వరకు అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి మంత్రివర్గంలో ప్రజా పనుల శాఖామంత్రిగా దురైమురుగన్ వ్యవహరించారు. ఆయన మంత్రి హోదాలో అధికారాన్ని దుర్వినియోగం చేసి, ఆదాయం కంటే అధిక ఆస్తులు వెనకేసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన అన్నాడీఎంకే ప్రభుత్వం హయాంలో మంత్రి దురైమురుగన్ రూ.3.92 కోట్లు ఆదాయానికి మించి కూడబెట్టుకున్నారనే కారణంగా ఆయనతో పాటు భార్య, కుమారుడు, కోడలు, సోదరుడిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. అక్రమార్జనకు సంబంధించి వారిని పోలీసులు విచారణ కూడా జరిపారు. ఈ నేపథ్యంలో వేలూరు ప్రిన్సిపల్ సెషెన్స్ కోర్టులో మంత్రి దురైమురుగన్ కేసుపై సాగిన విచారణ ముగియడంతో, న్యాయమూర్తి 2007వ సంవత్సరం తీర్పునిచ్చారు. అందులో మంత్రి దురైమురుగన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను అక్రమార్జన కేసు నుంచి విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ తీర్పును పరిశీలించాలని కోరుతూ, 2013వ సంవత్సరం అవినీతి నిరోధక శాఖ తరపున మద్రాస్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై పలుమార్లు విచారణ జరిగింది. మంత్రి దురైమురుగన్ తరుపు న్యాయవాదులు, ప్రభుత్వ తరుపు న్యాయవాదులు హాజరై వాదించారు. ఈ వాదనలు విన్న హైకోర్టు తీర్పుతేదీని ప్రకటించకుండా జనవరిలో వాయిదా వేస్తూ ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఈ కేసుకు సంబంధించిన తీర్పు విడుదలైంది. అందులో, అక్రమార్జన కేసులో మంత్రి దురైమురుగన్‌తో సహా వారి కుటుంబ సభ్యులను విడుదల చేస్తూ వేలూరు కోర్టు ఇచిచన ఉత్తర్వులను హైకోర్టు రద్దుచేసింది. ఈ కేసులో మంత్రి దురైమురుగన్, ఆయన కుటుంబ సభ్యులను ఆరు నెలల్లో ఏసీబీ విచారణ పూర్తిచేయాలంటూ హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

సివిల్స్ విజేతలకు ప్రభుత్వ నజరానా

● రవాణా ఖర్చులకు తలా రూ.50 వేలు
● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు ఢిల్లీ వెళ్లేందుకు రవాణా ఖర్చులకు తలా రూ.50వేలు అందజేస్తామని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తెలిపారు. శాసనసభ సమావేశాల్లో బుధవారం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... సివిల్స్ సహా పలు పోటీ పరీక్షలకు 'నాన్ ముదల్వన్' పథకం కింద శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆ ప్రకారం, సివిల్స్ పరీక్షలకు శిక్షణ తీసుకున్న 134 మందిలో 50 మంది 2024 యూపీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 2021లో యూపీఎస్సీ పరీక్షల్లో రాష్ట్రానికి చెందిన 27 మంది మాత్రమే ఉత్తీర్ణులు కాగా, ప్రస్తుతం 57 మంది ఉత్తీర్ణులు కావడం అభినందనీయమన్నారు. ఉత్తీర్ణులైన 57 మందిలో 50 మంది రాష్ట్ర ప్రభుత్వ 'నాన్ ముదల్వన్' పథకంలో శిక్షణ పొందారని తెలిపారు. యూపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు రూ.10 కోట్లు కేటాయించామన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు ఢిల్లీ వెళ్లేందుకు తలా రూ.50వేలు ప్రోత్సాహక నిధి అందజేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తెలిపారు.



శాసనసభలో ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

సమాచార దర్శిని

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరం, షోలింగనల్లూర్ డివిజన్ల పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కార శిబిరం గురువారం జరుగనున్నాయి. పల్లావరం ఆఫీసర్స్ లైన్ సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు జరిగే సమావేశంలో ఆయా డివిజన్లకు చెందిన వినియోగదారులు పాల్గొని కొత్త కనెక్షన్లు, మరమ్మతులు, విద్యుత్ బిల్లులు, విద్యుత్ కోతలు తదితరాలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

28 నుంచి వాలీబాల్ శిక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నెల్లై బ్రాండ్స్ వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యంలో 41వ వాలీబాల్ వేసవి శిక్షణ ఎగ్మూర్‌లోని రాధాకృష్ణన్ స్టేడియంలో ఈ నెల 28 నుంచి ప్రారంభం కానుంది. ఈ శిక్షణలో 12 నుంచి 17 ఏళ్లలోపున్న వారు మాత్రమే పాల్గొనాలి. ఆసక్తి కలిగిన విద్యార్థులు ప్రారంభం రోజున స్టేడియం వద్దకు వచ్చి పేరు నమోదుచేసుకోవాలి. మరిన్ని వివరాలకు 9382207524 అనే నెంబరు సంప్రదించవచ్చు.

ఎస్డీఏటీ ఆధ్వర్యంలో క్రీడా శిక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు క్రీడాభివృద్ధి సమాఖ్య (ఎస్డీఏటీ) ఆధ్వర్యంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ ఈ నెల 25 నుంచి మే 15వ తేది వరకు జరుగనుంది. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... ఉదయం, సాయంత్రం జరిగే శిక్షణకు 18 ఏళ్లలోపున్న విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనవచ్చు. నెహ్రూ పార్క్‌లో అథ్లెటిక్స్, బాడ్మింటన్, షేనాయ్‌నగర్, మొగప్పేర్‌లలో బాడ్మింటన్, గోపాలపురంలో బాక్సింగ్, పెరియమేడు నెహ్రూ స్టేడియంలో అథ్లెటిక్స్, జూడో, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, ఏజీపీ ఆడిటోరియంలో జిమ్నాస్టిక్స్, డైవింగ్, నుంగంబాక్కం టెన్నిస్ స్టేడియం టెన్నిస్ సహా పలు ప్రాంతాల్లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. వివరాలకు 7401703480 అనే నెంబరు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

పినాకిని ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ బోగీలు

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పాత బోగీలు తొలగించి ఆధునిక వసతులతో కూడిన ఎల్‌హెచ్‌బీ బోగీలు అనుసంధానం చేస్తున్నారు. ఈ బోగీల్లో అగ్నిప్రమాదాల నివారణ, కుదుపులు లేని ప్రయాణం, భద్రతా అంశాలతో కూడుకుని ఉన్నాయి. ఆంధ్ర రాష్ట్రం విజయవాడ-చెన్నై సెంట్రల్ మధ్య నడుస్తున్న పినాకిని సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మంగళవారం నుంచి ఎల్‌హెచ్‌బీ బోగీలు అనుసంధానం చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

26న తెలుగు నేర్చుకున్న వారికి ప్రశంసా పత్రాలు

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉచిత తెలుగు తరగతుల్లో శిక్షణ పూర్తయిన వారికి ఈ నెల 26వ తేదీ ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. శనివారం మధ్యాహ్నం టి.నగర్, జీఎన్ చెట్టి రోడ్డులో వున్న అంకుర్‌ప్లాజాలోని సమాఖ్య కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి జనని అధ్యక్షురాలు డాక్టర్ నిర్మలా పళనివేల్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులనని సమాఖ్య అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరా దత్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

26 నుంచి వీఐటీలో వేసవి శిక్షణా శిబిరం

వేలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేలూరు వీఐటీ యూనివర్శిటీలో ఈ నెల 26 నుంచి ఉచిత వేసవి క్రీడాశిక్షణా శిబిరాన్ని ఆ కళాశాల నిర్వాహకులు ప్రారంభించనున్నారు. ఈ శిక్షణా తరగతులు మే నెల 16వ తేదీవరకు నిర్వహించనున్నారు. ఈ శిక్షణా శిబిరంలో ప్లస్‌టూ చదువుతున్న విద్యార్థినీ,విద్యార్థులకు బ్యాస్కెట్ బాల్, చెస్, ఫుట్‌బాల్, కరాటే, వాలీబాల్ తదితర క్రీడలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఉదయం 6.30 గంటలకు కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిబిరంలో తమ పేరు నమోదు చేసుకోవచ్చునని తెలియజేశారు.

విద్యార్థులకు సైన్స్ వర్క్‌షాప్

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు వేసవికాల సైన్స్ శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాలు మే నెలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కోట్టూరుపురంలోని బిర్లా ప్లానిటోరియంలో జరుగనున్నాయి. సైన్స్ శిబిరం మే 7 నుంచి 9 తేది వరకు (6 నుంచి 10 తరగతుల విద్యార్థులు), 10వ తేది టెలిస్కోప్ నిర్మాణ వర్క్ షాప్ (8 నుంచి 10 తరగతులు), 14న పోల్‌స్కోప్ వర్క్ షాప్ (6 నుంచి 10 తరగతులు), 15,16 తేదీల్లో రోబోటిక్స్ వర్క్ షాప్ (6 నుంచి 10 తరగతులు), 21,22 తేదీల్లో 3డీ ప్రింటర్ వర్క్ షాప్ (6 నుంచి 10వ తరగతుల విద్యార్థులు) నిర్వహించనున్నారు. ఒక్కో వర్క్‌షాప్‌కు 50 మందిని మాత్రమే అనుమతించనున్నారు. వర్క్ షాప్‌లో పాల్గొనే విద్యార్థులు ఇంటర్నెట్ సదుపాయం ఉన్న ల్యాప్‌టాప్ తీసుకురావాలి. విద్యార్థులు www.tnstc.gov.in అనే వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదుచేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 044-24410025, 044-29520375 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

విమానాశ్రయం-కిలాంబాక్కం మెట్రో భూసేకరణకు అనుమతి

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం నుంచి కిలాంబాక్కం వరకు మెట్రో విస్తరణ ప్రాజెక్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అలాగే, భూసేకరణ చేపట్టేందుకు సీఎంఆర్‌ఎల్‌కు అనుమతులు మంజూరు చేసింది. విమానాశ్రయం నుండి పల్లావరం, క్రోంపేట, తాంబరం, పెరుంగళత్తూర్, వండలూరు మీదుగా కిలాంబాక్కం అనుసంధానం చేసేలా 15.46 కి.మీ మేర మెట్రో మార్గం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మెట్రో విస్తరణ ప్రాజెక్ట్ నివేదికను సీఎంఆర్‌ఎల్ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించిన నేపథ్యంలో, అనుమతులు మంజూరయ్యాయి. సమగ్ర ప్రణాళిక తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి ఆమోదం పొందేలా చర్యలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక, మెట్రో ప్రాజెక్ట్‌కు అవసరమైన భూసేకరణ చేపట్టేందుకు సీఎంఆర్‌ఎల్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి జారీచేసింది.

ప్రభుత్వ వైద్యశాలలో కలెక్టర్ పరిశీలన


వైద్యకళాశాలలతో పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని ప్రభుత్వ వైద్యశాల, ఆస్పత్రులను బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలోని రోగులను, వైద్యకళాశాల విద్యార్థులను అక్కడున్న వసతులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆస్పత్రి మెడికల్ విభాగంలో మందులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు అత్యాధునిక పరికరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారులు, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రోహిణిదేవీ, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లీజుకు వక్ఫ్ బోర్డు స్థలాలు

● మంత్రి నాజర్

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ భూములపై సాంఘిక సంక్షేమ ప్రాజెక్ట్‌ల కోసం దరఖాస్తులు వస్తే, వాటిని పరిశీలించి, నిబంధనలకు లోబడి లీజుకిచ్చేలా చర్యలు చేపడతామని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి నాజర్ తెలిపారు. ఈ మేరకు శాసనసభ సమావేశాల్లో మంగళవారం ఎంఎంకే సభ్యులు జవాహిరుల్లా అడిగిన ప్రశ్నకు మంత్రి నాజర్ సమాధానమిస్తూ... వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చెన్నైలో వక్ఫ్ ట్రిబ్యునల్ పనిచేస్తుందన్నారు. మదురైలోనూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే, తిరుచ్చి, కోవై ప్రాంతాలను పరిశీలించి, అవసరమైతే అక్కడ కూడా ట్రిబ్యునల్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు. మసీదులు, శ్మశానాలు, దర్గా, మదర్సా తదితరాలకు పట్టాలివ్వాలని భూ పరిపాలన కమిషనర్‌కు సూచిస్తూ లేఖ రాసినట్లు మంత్రి తెలిపారు.

వేలూరులో జాక్టో-జియో ఆందోళన



వేలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని అన్నా అరంగంలో జాక్టో-జియో ఉద్యోగుల నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాక్టో-జియో పేరవై జిల్లా ఆర్గనైజర్లు జోషి, జయకాంతన్ మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వానికి తాము గత నెల 24వ తేదీ పది డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందించామని, ఇప్పటివరకు ఒక్కటి కూడా నెరవేర్చలేదని వారు తెలిపారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్, ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనార్ధన్ సహా 200 మందికి పైగా మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

2.5 టీఎంసీలు విడుదల చేయండి!

● కర్ణాటక సర్కారుకు కావేరి మండలి ఆదేశం

టి.నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డెల్టా జిల్లాలకు సాగు నీరందించేలా మే నెలాఖరువరకూ 2.5 టీఎంసీల చొప్పున కావేరి నదీ జలాలను విడుదల చేయాలని కావేరి నిర్వాహక మండలి కర్ణాటక ప్రభుత్వానికి ఆదేశించింది. ఢిల్లీల్లో మంగళవారం కావేరి నిర్వాహక మండలి 39వ సమావేశం ఆ మండలి ఛైర్మన్ ఎస్కే హల్దార్ అధ్యక్షతన జరిగింది. ఆ సమావేశంలో కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. కర్ణాటక ప్రభుత్వం సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం తమిళనాడులోని కావేరి డెల్టా జిల్లాలకు కావేరి జలాలను విడుదల చేయాలని మండలి ఆదేశించింది.

కావేరి డెల్టా ప్రాంతాల్లో మూడేళ్లకొకసారి రోడ్ల నిర్మాణం

● మంత్రి ఏవీ వేలు

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కావేరి డెల్టా ప్రాంతాల్లో మూడేళ్లకు ఒకసారి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు శాసనసభలో మంత్రి ఏవీ వేలు తెలిపారు. శాసనసభ సమావేశాల్లో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో డెల్టా ప్రాంతాల్లో నీటి పారుదల ఉన్న భూములకు వెళ్లే రోడ్లు సాధారణ ప్రమాణాలతో నిర్మించడం వల్ల బురదమయంగా మారుతున్నాయని, డెల్టా ప్రాంతాల్లో నాణ్యమైన రోడ్లు నిర్మిస్తారా? అంటూ కాట్టుమన్నార్‌కోయిల్ ఎమ్మెల్యే సింతనైసెల్వన్ ప్రశ్నించారు. దీనికి రహదారుల శాఖ మంత్రి ఏవీ వేలు సమాధానమిస్తూ... నేల నాణ్యత బట్టి రోడ్ల జీవితకాలం ఉంటుందని, నేల నాణ్యతగా లేకపోతే రోడ్లు త్వరగా దెబ్బతింటాయన్నారు. నేల గట్టిగా ఉన్న ప్రాంతాల్లో నిర్మించే రోడ్లు ఐదేళ్లు దృఢంగా ఉంటాయని, బురదగా ఉన్న ప్రాంతాల్లో మూడేళ్లకు దెబ్బతింటాయని తెలిపారు. అందువల్ల డెల్టా ప్రాంతాల్లో మూడేళ్లకు ఒకసారి రోడ్లు నిర్మాణ సాధ్యాసాధ్యాలపై పరిశీలిస్తున్నట్లు, నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.

భక్తుల భద్రత దృష్ట్యా ఆటోలకు క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్లు

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై సందర్శించే భక్తుల భద్రత దృష్ట్యా ఆటోలకు క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్లు వేశారు. ప్రసిద్ధిచెందిన తిరువణ్ణామలై ఆలయానికి పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. దీంతో, తిరువణ్ణామలై నగరంలో 24 గంటలకు జనసంచారం ఉంటుంది. భక్తులు పలు ప్రాంతాలకు వెళ్లేందుకు ఆటోలు ఆశ్రయిస్తుంటారు. దీంతో, పొరుగు జిల్లాల ఆటోలు కూడా ఈ ప్రాంతంలో నడుపుతున్నారు. దీనిపై దృష్టి సారించిన అధికారులు, భక్తుల భద్రత దృష్ట్యా నగరంలో తిరుగుతున్న 2,160 ఆటో డ్రైవర్ల వివరాలు సేకరించి, తొలివిడతగా 1,750 ఆటోలకు క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్లు అంటించారు. ఈ కోడ్‌ను సెల్‌ఫోన్‌లో స్కాన్ చేయడం ద్వారా ఆటో, డ్రైవర్ వివరాలు తెలుసుకునే వీలుందని అధికారులు తెలిపారు.

నూతన వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి!

● సమైక్య జమాద్ కూటమి నిరసన



వేలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నూతన వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వ్యతిరేకిస్తూ వేలూరులోని పేర్నాంబట్టులో ముస్లిం సమైక్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం కమిటీ అధ్యక్షులు హాజీ ఇస్మాయిల్ మాట్లాడుతూ, ముస్లింల హక్కులను కాలరాసేందుకే కేంద్రప్రభుత్వం ఈ నూతన వక్ఫ్ చట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టిందని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేలూరు డీఎంకే కార్యదర్శి అహ్మద్, సుల్తాన్ అహ్మద్‌లతో పాటు పెద్దసంఖ్యలో ఇస్లామీయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

● కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆదేశం



వేలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లాలోని గుడియత్తం, కాట్పాడి తదితర ప్రాంతాల్లోని పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై బుధవారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి సమీక్షా సమావేశం నిర్వహించారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం ప్రారంభించిన గ్రామ పంచాయతీ పనులను వేగవంతం చేయాలని ఆ శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సెంథిల్‌కుమార్, జ్ఞానశేకరన్, ఇంజనీర్ శ్రీనివాసన్ తదితరలు పాల్గొన్నారు.

ఎస్ఐ పోస్టుల జాబితా రద్దు

● కొత్త జాబితా సిద్ధం చేయాలని హైకోర్టు ఆదేశం

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 621 ఎస్ఐ పోస్టుల భర్తీకి విడుదల చేసిన జాబితాను రద్దు చేసిన మద్రాసు హైకోర్టు, మూడు నెలల్లో కొత్త జాబితా విడుదల చేయాలని ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 621 ఎస్ఐ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ 2023లో విడుదల కాగా, వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. రాతపరీక్ష, దేహదారుఢ్య పరీక్ష, ఇంటర్వ్యూ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో, గత ఏడాది జనవరిలో తాత్కాలిక జాబితా విడుదల చేశారు. ఈ పోస్టుల భర్తీలో సరైన రిజర్వేషన్ విధానాలు పాటించలేదని అభ్యర్థుల తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ కేసు విచారణకు వచ్చిన సయమంలో, కొత్త ఎంపిక జాబితా విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టుకు తెలియజేసింది. ప్రభుత్వ వివరణ అనంతరం కేసు విచారణ ముగిసినట్లు హైకోర్టు ప్రకటించింది. గత ఏడాది అక్టోబరులో సవరించిన తాత్కాలిక జాబితా విడుదల చేశారు. తొలి జాబితాలో ఉన్న పలువురి పేర్లు రెండో జాబితాలో లేవని, మార్కులు, రిజర్వేషన్ తదితర వివరాలు లేకుండా జాబితా విడుదల చేశారంటూ సుమారు వంద మంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లు విచారించిన సీవీ కార్తికేయన్ నేతృత్వంలోని ధర్మాసనం... తాత్కాలిక జాబితా రద్దు చేస్తున్నట్లు, సరైన రిజర్వేషన్ విధానం ఆధారంగా కొత్త అభ్యర్థుల ఎంపిక జాబితా మూడు నెలల్లో విడుదల చేయాలని ఉత్తర్వులు జారీచేశారు.

బీజేపీ కార్యాలయానికి భద్రత కల్పించండి

● నయినార్ నాగేంద్రన్ డిమాండ్

టి.నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం కమలాలయానికి పటిష్ఠమైన పోలీసు భద్రత కల్పించాలంటూ ఆ పార్టీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ డీఎంకే మిత్రపక్షమైన ఆదితమిళర్ కట్చికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు నగరంలో ప్రధాని మోదీ చిత్రపటాలను దగ్ధంచేస్తూ నిరసన ప్రదర్శనలు చేస్తూ, కమలాలయాన్ని కూడా ముట్టడించేందుకు ప్రయత్నించారని ఆయన పేర్కొన్నారు. వక్ఫ్ చట్టంపై ప్రస్తుతం సుప్రీం కోర్టులో విచారణ జరగాల్సి ఉందని, ఈ పరిస్థితుల్లో ఆదితమిళర్ కట్చి కార్యకర్తలు ఇలాంటి హింసాత్మక సంఘటనలకు పాల్పడటం గర్హనీయమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని కమలాలయానికి మరింత పటిష్ఠమైన పోలీసు భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

మంత్రి పదవా? బెయిలా? ఏది కావాలి?

● సెంథిల్ బాలాజీని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

ప్యారీస్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మంత్రి పదవి కావాలా? బెయిలు కావాలా? అని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి సెంథిల్ బాలాజీని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ప్రశ్నించారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రవాణా శాఖామంత్రిగా పనిచేసిన సెంథిల్ బాలాజీ ఆ శాఖలో ఉద్యోగావకాశాలు ఇప్పిస్తామని నమ్మించి పలువురి దగ్గర పెద్దమొత్తంలో నగదు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారని ఆయనపై ఈడీ అధికారులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో 2024 సెప్టెంబరులో మంత్రి సెంథిల్ బాలాజీకి సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇందుకు వ్యతిరేకంగా ఈడీ బెయిల్‌పై విడుదయ్యాక సెంథిల్ బాలాజీ మళ్లీ మంత్రిగా కొనసాగుతున్నారని, అందువల్ల ఆయన తన కేసుకు సంబంధించిన సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశముందని అనుమానం వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో, సుప్రీం కోర్టులో మంత్రి సెంథిల్ బాలాజీ బెయిల్ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ బుధవారం విచారణకు రాగా, ఇరు తరఫు న్యాయవాదులు హాజరై వాదించారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు ధర్మాసనం మంత్రి తరఫు న్యాయవాదులనుద్దేశించి 'మెరిట్ ప్రాతిపదికన తాము మీకు బెయిల్ మంజూరు చేయలేదు రాజ్యాంగ శాసనం సెక్షన్ 21ఐ ప్రకారం బెయిలు మంజూరు చేశాము. ఈ కేసు విచారణ మరో రాష్ట్రానికి బదిలీ చేయలేము. సెంథిల్ బాలాజీకి మంత్రి పదవి కావాలా? లేకుంటే బెయిల్ కావాలా? దీనిపై తగిన నిర్ణయం తీసుకుని ఈ నెల 28న తెలియజేయండి' అని ఆదేశించింది.

ఐక్యతతో ముందుకెళ్దాం!


డాక్టర్ నిషిత రాజును సత్కరిస్తున్న పళ్లిపట్టు బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్

తిరుత్తణి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పార్టీశ్రేణులంతా కలిసి కట్టుగా పార్టీని ముందుకు తీసుకెళ్లాలని బీజేపీ మహిళా మోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ నిషిత రాజు పిలుపునిచ్చారు తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు మంగళవారం సాయంత్రం పళ్లిపట్టు బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్ మహిళా మోర్చా నాయకురాలు డాక్టర్ నిషిత రాజును పళ్లిపట్టులోని ఆమె గృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు.

మీటర్ ఛార్జీలను ప్రకటించాలని కోరుతూ నగరంలో ఆటోడ్రైవర్ల రాస్తారోకో

● పలువురి అరెస్టు


చేపాక్ శివానందసాలైలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు, కార్మికులు

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో బైక్ టాక్సీలను రద్దు చేసి, మీటర్ ఛార్జీలను ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఆటో డ్రైవర్లు చేపాక్ శివానందసాలైలో బుధవారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు. పోలీసుల అనుమతి లేకుండా సుమారు వెయ్యి మందికి పైగా ఆటో డ్రైవర్లు ఆందోళన చేశారు. పోలీసులు వీరిని తొలగించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పోలీసులకు, ఆటో డ్రైవర్లకు మధ్య తోపులాట జరిగింది.. దీంతో సుమారు 400 మంది ఆటో డ్రైవర్లను పోలీసులు అరెస్టు చేశారు. అన్నాసాలై పెరియార్ విగ్రహం కూడలి నుంచి ఆటో డ్రైవర్లు సచివాలయం ముట్టడి కార్యక్రమం ప్రారంభించారు. అక్కడి నుంచి ఊరేగింపుగా బయలుదేరి స్వామి శివానందసాలైలో ప్రవేశించారు. అప్పటికే ఆ ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేసి సిద్ధంగా ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, ఆటో డ్రైవర్ల మధ్య తోపులాట జరిగింది.

అన్బుమణి కేసు రద్దు చేసిన హైకోర్టు

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) ఎన్‌ఎల్‌సీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనలో అన్బుమణిపై నమోదైన కేసును మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. ఎన్‌ఎల్‌సీ విస్తరణకు వ్యవసాయ భూముల సేకరణ, వరి పంట ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ 2023లో పీఎంకే నేత డా.అన్బుమణిపై తెన్‌కుత్తు వీఏఓ గోపాలకృష్ణన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నైవేలి పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసు రద్దు చేయాలని కోరుతూ అన్బుమణి దాఖలుచేసిన పిటిషన్‌ను బుధవారం విచారించిన హైకోర్టు, అన్బుమణిపై నమోదైన కేసు కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

మెదడు నిర్జీవమైన బాలుడి అవయవదానం

● ప్రభుత్వం తరఫున నివాళి

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మెదడు నిర్జీవమై అవయవాలు దానం చేసిన ఆంధ్ర బాలుడి మృతదేహానికి ప్రభుత్వం తరఫున నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్రం ప్రకాశం జిల్లా ఉలవపాడు సమీపం కె.రాజుపాళయం గ్రామానికి చెందిన అభిషేక్ సాత్విక్ (17) మడిపాక్కంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను మెదడు నిర్జీవమైనట్లు గుర్తించిన వైద్యులు, అభిషేక్ కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో మూత్రపిండాలు, కాలేయం, గుండె తదితర అవయవాలు దానంగా స్వీకరించారు. ప్రభుత్వ ఉత్తర్వులతో, ఆస్పత్రిలో బాలుడి మృతదేహానికి చెన్నై జిల్లా యంత్రాంగం తరఫున దక్షిణ చెన్నై డివిజనల్ ఆఫీసర్ రంగరాజన్, ఆలందూర్ తహసీల్దార్ కుప్పమ్మాళ్ రాము తదితరులు నివాళులర్పించారు.

యూట్యూబ్ చూసి తుపాకీ తయారీ

● ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): యూట్యూబ్ చూసి తుపాకి తయారుచేసిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కడలూరు జిల్లా బన్రూటి సమీపం కాటంపులియూర్ ఎస్ఐ వేల్‌మురుగన్ నేతృత్వంలో పోలీసులు మంగళవారం సాయంత్రం గస్తీ తిరిగారు. ఆ సయమంలో అటుగా వచ్చిన ముగ్గురిని సందేహించిన పోలీసులు, వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా తుపాకి, కత్తి లభించాయి. విచారణలో... వారు పురంగణి తూర్పు వీధికి చెందిన మణికంఠన్ , వేలన్‌కుప్పం ప్రాంతానికి చెందిన విక్రమ్, పాత పిళ్లయార్‌కుప్పం మారియమ్మన్ ఆలయ వీధికి చెందిన సంతాన ప్రభు అని, అడవి పందులు, కుందేళ్లు, పక్షులను వేటాడేందుకు యూ ట్యూబ్ చూసి తుపాకి తయారుచేసినట్లు తెలియడంతో వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

ఏనుగుదాడిలో గాయపడిన మహిళ మృతి


మృతురాలు సరసు

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా మసినకుడి వద్ద అడవి ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సరసు (58) అనే మహిళ బుధవారం ఉదయం మృతి చెందింది. సోమవారం సాయంత్రం సరసు, ఆమె భర్త బైకులో పొక్కాపురం మారియమ్మన్ గుడికి వెళ్ళి తిరిగి వస్తుండగా మసినకుడి రహదారిలో సంచరిస్తున్న అడవి ఏనుగు దాడి చేసింది. బైకును తొండటంతో నెట్టివడేయటంతో భార్యాభర్తలిద్దరూ దూరంగా రోడ్డుపై పడ్డారు. ఈ సంఘటనలో సరసకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను ఊటీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధశారం ఉదయం ఆమె మృతి చెందారు.

రైలింజన్లలో టాయిలెట్, ఏసీ

● వెల్లడించిన దక్షిణ రైల్వే


ఏసీ, టాయిలెట్ సదుపాయాలతో రైలింజన్



పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): లోకో పైలట్ల సౌకర్యార్థం రైలింజన్లలో టాయిలెట్, ఏసీ ఏర్పాటుచేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ఈ విషయమై దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... లోకో పైలెట్ల భద్రతే లక్ష్యంగా, అన్ని వసతులు కల్పించి, వారు ప్రశాంతంగా విధులు చేపట్టేలా చర్యలు చేపట్టామని, ఆ క్రమంలో రైలింజన్‌కు పూర్తిగా ఏసీ చేశామన్నారు. దక్షిణ రైల్వే ప్రస్తుతం నడుపుతున్న 237 ఆధునిక రైలింజన్లలో 206 రైలింజన్లకు ఏసీ ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన 31 రైలింజన్లకు ఆరు మాసాల్లో ఏసీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదే సమయంలో డీసీ విద్యుత్‌తో నడిచే సాధారణ రైలింజన్ (కన్వెన్షన్ ఇంజన్)లకు ఏసీ ఏర్పాటుచేయడం సవాల్‌తో కూడుకున్న పని అన్నారు. ఇలాంటి రైలింజన్లలో ఏసీ ఏర్పాటుకు పై భాగంలో కొన్ని మార్పులు చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతమున్న 291 కన్వెన్షన్ ఇంజన్లలో 28 ఇంజన్లకు ఏసీ ఏర్పాటుచేశామన్నారు. ప్రస్తుతం అన్నిరకాల రైలింజన్లు ఏసీ సదుపాయంతో తయారుచేస్తున్నట్లు తెలిపారు.

టాయిలెట్ సౌకర్యం : అరక్కోణం లోకోలో తయారుచేస్తున్న 9 డబ్ల్యూఏజీ ఇంజన్లకు యూరినల్స్ కోసం టాయిలెట్ ఏర్పాటుచేశామన్నారు.ఇలా 150 ఇంజ న్ల తయారీకి అనుమతులిచ్చినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే కొత్త రైలింజన్లు అందుబాటులోకి వస్తాయన్నారు.రాత్రి వేళ రైలు భద్రత రీత్యా హెడ్‌లైట్ల కాంతి పెంచుతున్నామన్నారు. ఆ ప్రకారం, దక్షిణ రైల్వేలోని 621 ఇంజన్లలో 4344 ఇంజన్ల హెడ్ లైట్లు ఎల్‌ఈడీగా మార్చినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

వీధికుక్కల దాడిలో జింక మృతి



తిరుత్తణి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని పుక్కాడు అటవీ ప్రాంతంలో నీటి కోసం చెరువు దగ్గరకు వెళ్లిన ఓ జింక వీధి కుక్కల దాడిలో మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే... పుక్కాడు అటవీప్రాంతంలోని జింకలు దాహార్తిని తట్టుకోలేక, నీటికోసం గ్రామ పొలిమేరల్లోని చెరువు ల దక్కరకు వస్తుంటాయి. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం ఆ ప్రాంతంలోని చెరువు దగ్గరకు నీటికోసం వచ్చిన ఓ జింకను గ్రామంలోని వీధి కుక్కలు వెంటాడి, తీవ్రంగా గాయపరిచాయి. ఆ జింక అక్కడికక్కడే మృతిచెందింది. ఇది గమనించిన కొంతమంది గ్రామస్థులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా, ఘటనా స్థలానికి చేరుకున్న వారు మృతి చెందిన జింకను స్వాధీనం చేసుకుని, అటవీశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో పూడ్చిపెట్టారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరుగకుండా వన్యప్రాణుల సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మహిళ మృతి

తిరుత్తణి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు పట్టాలపై ఓ గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. బుధవారం మధ్యాహ్నం అటువైపు వెళ్తున్న కొంతమంది మహిళ మృతేదహం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పోలీసుల కథనం మేరకు 50ఏళ్ళ ఈ మహిళ, కుటుంబ కలహాల కారణంగా ఈ ప్రాంతానికి వచ్చి ఆత్మహత్యకు పాల్పడి వుంటుందా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

12కి వేంగైవయల్ కేసు వాయిదా

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేంగైవయల్ కేసు మే 12వ తేదీకి వాయిదాపడింది. పుదుకోట జిల్లా వేంగైవయల్ దళిత కాలనీ ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో మానవ వ్యర్థాలు కలిసిన వ్యవహారంపై సీబీసీఐడీ విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో అదే గ్రామానికి చెందిన కానిస్టేబుల్ మురళిరాజ, ముత్తుకృష్ణన్, సుదర్శన్ తదితరులపై ఛార్జిషీటు దాఖలుచేశారు. అనంతరం మార్చి 12న క్రిమినల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఛార్జిషీటు నకళ్లు ముగ్గురికి అందజేశారు. ఈ వ్యవహారానికి తమకు ఎలాంటి సంబంధం లేదని, ఈ కేసు నుంచి తమను విడిపించాలని కోరుతూ ముగ్గురు కోర్టులో పిటిషన్లు వేశారు. ఈ వ్యవహారంలో వారికి ప్రమేయం ఉన్నట్లు ఆధారాలున్నాయని సీబీసీఐడీ తెలిపింది. ఈ కేసు మళ్లీ బుధవారం విచారణకు రాగా, నేరారోపణ ఎదుర్కొంటున్న ముగ్గురు హాజరుకాకపోవడంతో, తదుపరి విచారణ మే 12వ తేదీకి వాయిదావేస్తూ మేజిస్ట్రేట్ జి.అచ్యుతవానన్ ఉత్తర్వులు జారీచేశారు.

ఆండార్‌కుప్పంలో రేపటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు


మూలవిరాట్టు బాలసుబ్రహ్మణ్యస్వామి

టి.నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం ఆండార్‌కుప్పంలోని బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో 25 నుంచి మే 4 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.బాలాజీ, ఆలయ పారంపర్య ట్రస్టీ ఏడీ రాజశేఖర్ గురుకుల్ తెలిపారు. ఈ నెల 25 ఉదయం ధ్వజారోహణంతో ఈ వేడుకలు ప్రారంభమవుతాయని 28న భరణి రోజున నాగవాహన సేవ, 29న కృత్తిక పర్వదినం మయూరవాహనసేవలు జరుగుతాయని, ప్రధాన ఘట్టమైన మహారథోత్సవం మే ఒకటిన జరుగుతుందని, మే నాలుగు ఉదయం తీర్థవారి వేడుకలు నిర్వహిస్తామని వివరించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 25 నుండి మే 4 వరకు భక్తుల కోసం రోజూ నిర్వహించే ప్రత్యేక అభిషేకాలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

26న నాగనాథస్వామి ఆలయంలో కేతు సంక్రమణ వేడుకలు


నాగనాథస్వామి ఆలయం, విశేషాలంకరణలో స్వామివారు

టి.నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా పూంపుహార్ సమీపం కీళ్‌పెరుంపళ్లమ్ నాగనాథస్వామి ఆలయంలో ఈ నెల 26న కేతు సంక్రమణ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆలయంలో కేతు గ్రహానికి ప్రత్యేక సన్నిధి ఉంది. ఈ క్షేత్రానికి కేతు పరిహార క్షేత్రంగా పేరుంది. ఇక్కడ స్వామివారిని దర్శించుకుంటే కోర్టు కేసుల్లో విజయం సాధించవచ్చని, వివాహ అడ్డంకులు సైతం తొలగిపోతాయని భక్తుల ప్రగాఢవిశ్వాసం. కేతువు ఏడాదిన్నరకొకసారి ఒక రాశి నుంచి మరొక రాశిలోకి ప్రవేశిస్తుంటారు. ఆ మేరకు కేతుభగవానుడు ఈ నెల 26 శనివారం సాయంత్రం 4.20 గంటలకు కన్యారాశిలో నుంచి సింహరాశిలోకి ప్రవేశించనున్నాడు. ఆ సంక్రమణ సందర్భంగా నాగనాథస్వామి ఆలయంలో ఈ నెల 26 ఉదయం నుండి కేతు పరిహార యాగం నిర్వహించి పూర్ణాహుతి, దీపారాధన చేయనున్నారు. సాయంత్రం 4.20 గంటలకు దీపారాధన అనంతరం భక్తులకు ప్రసాదం వినియోగించనున్నారు. ఈ వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు.

సివిల్స్‌లో రామనాథపురం యువకుడికి రాష్ట్రస్థాయిలో ఐదో స్థానం


సివిల్స్‌లో పాసైన శ్రీరక్షత్

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసు ఫలితాల్లో రామనాథపురం సంస్థానం వీధిలో నివసిస్తున్న రామ్ ప్రకాష్, లక్ష్మీ దంపతుల కుమారుడు శ్రీరక్షత్ జాతీయ స్థాయిలో 52వ స్థానం, రాష్ట్రస్థాయిలో ఐదో స్థానం సాధించారు. 1 నుండి 10వ తరగతి వరకు రామనాథపురం వివేకానంద విద్యాలయం, ఇన్‌ఫాంట్ జీసెస్ మెట్రిక్యులేషన్ స్కూలులో చదివి, ప్లస్-1, ప్లస్-2 మండపం ప్రాంతాలోని కేంద్రీయ విద్యాలయలో చదివాడు. ఆ తర్వాత ఢిల్లీలోని మోతీలాల్ నెహ్రూ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి, అక్కడే ఉంటూ సివిల్స్‌కు శిక్షణ పొంది పరీక్ష రాసి స్వస్థలానికి తిరిగొచ్చాడు. తొలి ప్రయత్నంలో సివిల్స్ పరీక్షలో పాసైనట్లు తెలియగానే శ్రీరక్షత్‌ను తల్లిదండ్రులు, స్నేహితులు, కేంద్రీయ విద్యాలయం అధ్యాపకులు తదితరులు శుభాకాంక్షలు అందజేశారు. ఆ సందర్భంగా శ్రీరక్షత్ మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకుని పట్టుదలగా సివిల్స్ శిక్షణ పొంది శ్రమించి పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

సివిల్స్ విజేతల్లో విద్యుత్ బోర్డు చైర్మన్ తనయుడు


డాక్టర్ అరవింద్

టి.నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మంగళవారం విడుదలైన సివిల్ సర్వీస్ ఫలితాలలో ఎంపికైన 1009 మందిలో రాష్ట్ర విద్యుత్‌బోర్డు చైర్మన్ డాక్టర్ రాధాకృష్ణన్ తనయుడు డాక్టర్ అరవింద్ 80వ స్థానం సాధించారు.. అరవింద్ 2022లో నిర్వహించిన సివిల్స్ పరీక్షలో 361వ స్థానం సాధించాడు. అయితే ఏ ఉద్యోగంలోనూ చేరలేదు. ఈ నేపథ్యంలో 2024 సివిల్ సర్వీసు పరీక్షలకు హాజరైన అరవింద్ 80వ స్థానం సంపాదించుకున్నారు. ప్రస్తుతం అరవింద్ ఎండీ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు.

వివేకానంద ట్రస్టు స్కూల్‌కు జనరేటర్ విరాళం


జనరేటర్ అందిస్తున్న రోటరీ నిర్వాహకులు

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరునింద్రవూరు నాచియార్ చత్రంలో వున్న వివేకానంద ఎడ్యుకేషన్ ట్రస్టు స్కూల్, కృష్ణ మూలచంద్ మహేశ్వరి వివేకానంద విద్యాలయాలకు 'రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ టి.నగర్' (ఆర్‌సీఎంటీ) 62 కేవీ జనరేటర్ విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఎంటీ నిర్వాహకులైన పీపీ విపిన్ అగర్వాల్, డాక్టర్ వసుధా రాజశేఖర్, డాక్టర్ మహాలక్ష్మి, పీపీ కపిల్ మహేశ్వరి, శివరామన్, అర్జున్ ఆదికేశవ తదితరులు పాల్గొన్ని విద్యాలయాల నిర్వాహకులకు జనరేటర్‌ను అందించారు.

108 అంబులెన్స్‌ల ద్వారా 2.93 లక్షల మందికి చికిత్స



పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రమాదాల్లో గాయపడిన 2.93 లక్షల మందిని 108 అంబులెన్స్‌ల్లో ప్రభుత్వాసుపత్రుల్లో చేర్పించారు. రాష్ట్ర ప్రజా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ సంస్థ 108 అంబులెన్స్ సేవలు అందిస్తోంది. ఈ సంస్థ 1,353 అంబులెన్స్ వాహనాలు, 65 పిల్లల అత్యవసర చికిత్సా వాహనాలు, నాలుగు వీవీఐపీ వాహనాలు, 41 ద్విచక్ర అంబులెన్స్‌లు నడుపుతోంది. ఈ వాహనాల్లో సుమారు 6వేల మంది పనిచేస్తుండగా, ప్రతిరోజు సేవా కేంద్రానికి 10వేలకు పైగా కాల్స్ వస్తుంటాయి. ఈ విషయమై 108 అంబులెన్స్ సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 108 అంబులెన్స్ సేవలు జాప్యం లేకుండా అందిస్తున్నామన్నారు. కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందిన 11.46 నిమిషాల్లోనే ఘటన జరిగిన ప్రాంతాలకు అంబులెన్స్ చేరుకుంటుందన్నారు. 2024-25వ సంవత్సరంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన 2.93 లక్షల మంది రక్షించి ప్రభుత్వాసుపత్రులకు తరలించామని, వారిలో అధిక శాతం మంది ప్రాణాపాయం నుండి బయటపడ్డారని తెలిపారు. అలాగే, 2.79 లక్షల మంది గర్భిణులు 108 అంబులెన్స్ సేవలు వినియోగించుకున్నారన్నారు. ఇతర అత్యవసర సేవలకు 9.66 లక్షల మంది, కొండ గ్రామాల ప్రజలు, ఆదివాసీయులు 70,181 మంది సహా 16.10 లక్షల మంది లబ్ధిపొందారని వారు పేర్కొన్నారు.


'రెట్రో' సూర్య - పూజా హెగ్డే

మేడే రోజున విడుదల కానున్న చిత్రాలు ...

చిత్రజ్యోతి

సాధారణంగా వేసవి సెలవుల్లో ఫ్యామిలీ ఆడియన్స్‌ను లక్ష్యంగా చేసుకుని సినిమాలు విడుదలవుతుంటాయి. ఈ క్రమంలో మే ఒకటో తేదీన పలు చిత్రాలు విడుదల కానున్నాయి. హీరో సూర్య, పూజా హెగ్డే జంటగా నటించిన 'రెట్రో', శశికుమార్ - సిమ్రన్ జంటగా నటించిన 'టూరిస్ట్ ఫ్యామిలీ'తో మరికొన్ని చిన్న చిత్రాలు విడుదలకానున్నాయి. అలాగే, తెలుగులో నేచురల్ స్టార్ నాని నటించిన 'హిట్-3' సినిమా రిలీజ్‌కు సిద్ధమైంది. 'హిట్-1', 'హిట్-2' ఉత్కంఠ భరితమైన థ్రిల్లర్ జానర్‌లో రూపొందించారు. ఇపుడు 'హిట్-3'లో హీరో నాని నటించడంతో ఈ మూవీపై మరింత ఆసక్తి నెలకొంది. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన 'తండర్‌బోల్ట్స్' మూవీతో పాటు మలయాళ అనువాద చిత్రాలు కూడా మే ఒకటో తేదీ విడుదలవుతున్నాయి.

'పొట్టువిల్ అస్మిన్' బయోగ్రఫీ రిలీజ్ చేసిన లైకా ఫ్యామిలీ


'పొట్టువిల్ అస్మిన్' బయోగ్రఫీ ఆవిష్కరణ దృశ్యం

శ్రీలంకకు చెందిన ప్రముఖ కవి, తమిళ చలనచిత్ర గేయ రచయిత 'పొట్టువిల్ అస్మిన్' బయోగ్రఫీ పేరుతో ముద్రించిన పుస్తకాన్ని లైకా ప్రొడక్షన్ అధిపతి సుభాస్కరన్, లైకా ప్రొడక్షన్ హెడ్ జీకేఎం తమిళ్ కుమరన్ తాజాగా ఆవిష్కరించారు. 'పొట్టువిల్ అస్మిన్ : ఫ్రమ్ పొట్టువిల్ టు ది వరల్డ్, ఏ గ్లోబల్ తమిళ్ వాయిస్' అనే పేరుతో దీన్ని రూపొందించగా, అమెజాన్ కిండల్‌లో లభ్యం కానుంది. ఈ పుస్తకాన్ని నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో లైకా ప్రొడక్షన్ చైర్మన్ అల్లిరాజా సుభాస్కరన్, లైకా హెల్త్ కంపెనీ చైర్మన్ డాక్టర్ ప్రేమా సుభాస్కరన్, లైకా ప్రొడక్షన్ సీఈవో జీకేఎం తమిళ్ కుమరన్ ఆవిష్కరించారు. ప్రముఖ సంగీత దర్శకుడు విజయ్ ఆంటోనీ స్వరపరిచిన 'తప్పెల్లాం తప్పే ఇల్లెయ్' అనే పాటతో పొత్తువిల్ అస్మిన్ కోలీవుడ్‌లోకి అడుగుపెట్టి విషయం తెల్సిందే. అస్మిన్ గేయరచన చేసి శ్రీలంకలో చిత్రీకరించిన 'అయ్యోసామి నీ ఎనక్కు వేణామ్' అనే పాట విశేషాదరణ పొందింది. శ్రీలంకలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో 30కి పైగా అవార్డులు గెలుచుకున్న పొత్తువిల్ అస్మిన్‌కు కాంబోడియా కళలు, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ 'ఇంటర్నేసనల్ పొయట్ కన్నదాసన్' అవార్డుతో సత్కరించింది. ఈ నేపథ్యంలో పొట్టువిల్ అస్మిన్ బయోగ్రఫీని ఆంగ్లంలో ముద్రించి ఆవిష్కరించారు.

కోలీవుడ్ చిత్రాలకు అంత సత్తా లేదా?


రజనీకాంత్ - కమల్ హాసన్

పాన్ ఇండియా స్థాయిలో తమిళ చిత్రాలు సత్తా చూపలేకపోతుండటం కోలీవుడ్ ప్రేక్షకులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో రూ.వెయ్యి కోట్ల వసూలు అనేది కోలీవుడ్‌కు ఎండమావిగా మారింది. రజనీకాంత్, కమల్ హాసన్, అజిత్, విజయ్, సూర్య, విక్రమ్ వంటి ఎందరో స్టార్లు ఉన్నప్పటికీ వీరు నటించిన చిత్రాలు పాన్ ఇండియా స్థాయిలో రూ.వెయ్యి కోట్లు సాధించలేకపోతున్నాయి. ఇది తీరని కొరతగా తమిళ సినీ ప్రముఖులు భావిస్తున్నారు. అయితే, ఈ ఘనత తెలుగులో పలు చిత్రాలు సాధించాయి. 'బాహుబలి', 'బాహుబలి-2', 'ఆర్‌ఆర్‌ఆర్', 'కల్కి-2898 ఏడి, 'పుష్ప-2' వంటి చిత్రాలు రూ.1000 కోట్లను వసూలు చేశాయి. అలాగే, కన్నడంలో 'కేజీఎఫ్-2' కూడా ఆ స్థాయిలో వసూలు చేసింది. హిందీలో 'దంగల్', 'పఠాన్', 'జవాన్' చిత్రాలు రూ.వెయ్యి కోట్లను సాధించాయి. వీటిలో తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వం వహించిన 'జవాన్' ఉండటం కొంత ఊరటనిచ్చే అంశంగా చెప్పుకోవచ్చు. కోలీవుడ్ నుంచి టాలీవుడ్‌కు వెళ్ళి దర్శకుడు శంకర్ డైరెక్ట్ చేసిన 'గేమ్ చేంజర్', తమిళం నుంచి బాలీవుడ్‌కు వెళ్ళిన ఏఆర్.మురుగదాస్ తీసిన 'సికిందర్' మూవీ కూడా తీవ్ర నిరాశకు గురిచేశాయి. దీంతో తమిళ హీరోల చిత్రాల్లో ఒక్కటి కూడా పాన్ ఇండియా స్థాయిలో రూ.1000 కోట్ల కలెక్షన్లు రాబట్టలేవా? అనే చర్చ సాగుతోంది.

యోగిబాబు - అనామిక మహి జంటగా కొత్త చిత్రం


కొత్త చిత్రం పూజా కార్యక్రమం

ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు, అనామికా మహి జంటగా ఓ చిత్రం తెరకెక్కనుంది. పూజా కార్యక్రమం తాజాగా నగరంలో జరిగింది. 'మేర్కు తొడర్చి మల్లై' ఫేం లెనిన్ భారతి వద్ద అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేసి ఆర్.రాజ్‌మోహన్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. దేవ్ సినిమా పతాకంపై నిర్మితంకానుంది. ఇతర పాత్రల్లో కాళి వెంకట్, అయిలీ మదన్, భవా లక్ష్మణన్ తదిరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా దర్శకుడు రాజ్‌మోహన్ మాట్లాడుతూ, 'చెన్నైలో హార్డ్‌వేర్ షాపులో పని చేసే మధ్యతరగతి యువకుడి జీవితం, అతని ప్రేమ, హాస్యం వంటి అంశాలతో రూపొందిస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. చెన్నై, దాని పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపేలా ప్లాన్ చేశాం' అని పేర్కొన్నారు.


ఇటీవల వివాహమైన తన కుమారుడు, కోడలితో క్యాంపుకార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన సతీమణి దుర్గా స్టాలిన్‌ను కలిసిన మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా.


సచివాలయంలో శాసనసభలో వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన ఆర్థిక అనుబంధ పద్దులను ప్రవేశపెట్టనున్న సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్న ఆ శాఖల మంత్రి పి.మూర్తి, అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉష తదితరులు.


అన్నానగర్ జోనల్ ఆఫీసులో పారిశుధ్య కార్మికుల కోసం సహాయ కేంద్రాన్ని ప్రారంభించి, ఆ కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న మేయర్ ఆర్. ప్రియ


రాష్ట్రంలో ఫోరెన్సిక్ విశ్వవిద్యాలయం ఏర్పాటుపై చర్చలు జరిపిన ఢిల్లీ నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ వర్సిటీ డైరెక్టర్ డాక్టర్ పూర్విక్ పుక్రియాల్, గుజరాత్ నేషనల్ ఫోరెన్సిక్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ జడేజా తదితరులకు సచివాలయంలో జ్ఞాపికలు అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

కళ్లలగర్ ఉత్సవాలకు పటిష్ఠ భద్రత


బాలాలయ పూజలో మంత్రి పీకే శేఖర్‌బాబు

● మంత్రి పీకే శేఖర్‌బాబు

ప్యారీస్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆలయాల నగరం మదురైలో మే 12వ తేదీ జరుగనున్న కళ్లలగర్ వైగైనదీ ఆగమన వేడుకల్లో పాల్గొనే భక్తులకు మరిన్ని సదుపాయాలు సమకూర్చడంతో పాటు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయనున్నట్లు హిందూ దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు పేర్కొన్నారు. షావుకారుపేట సమీపంలోని కొండితోపులో వున్న పురాతన సెల్వ వినాయకుడు, పళని ఆలయానికి మహాకుంభాభిషేకం నిర్వహించేందుకు నిర్ణయించారు. ఇందుకోసం బుధవారం ఉదయం ఈ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన బాలాలయం పూజల్లో మంత్రి శేఖర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, మదురైలో మే నెలలో చిత్తిరై ఉత్సవాలను కోలాహలంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ, జిల్లా యంత్రాంగంతో కలిసి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. చిత్తిరై వేడుకల్లో ప్రధాన ఘట్టమైన మీనాక్షి సుందరేశ్వరుల తిరుకల్యాణం మే 8వ తేదీ జరుగుతుందని, ఇందులో వేలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున వారికి మెరుగైన వసతులు కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. మే 12న వైగైనదిలో కళ్లలగర్ స్వామివారు అశ్వవాహనంతో పాటు దర్శనమిచ్చే వైభవాన్ని కోలాహలంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. రాజధాని నగరంలో ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విలేఖర్లు మంత్రిని ప్రశ్నించారు. అందుకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం సహజమేనని, దీనిని రాజకీయ కోణంలో చూడటం సరికాదన్నారు. బాలాలయ పూజలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ 5వ జోన్ చైర్మెన్ పి.శ్రీరాములు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కోలాహలంగా జల్లికట్టు పోటీలు



ఎద్దును అదుపుచేస్తున్న యువకులు

పెరంబూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా తిరుచ్చుళి గ్రామంలో బుధవారం నిర్వహించిన జల్లికట్టు పోటీలు కోలాహలంగా సాగాయి. గ్రామంలోని కరుప్పస్వామి అయ్యనార్ స్వామి ఆలయ చిత్తిరై పొంగల్ ఉత్సవాల సందర్భంగా ఈ పోటీలు నిర్వహించారు. విరుదునగర్ జిల్లా చుట్టుపక్కల జిల్లాల నుంచి సుమారు 300 ఎద్దులు, 200 మంది యువకులు పోటీలో పాల్గొన్నారు. తొలుత ఎద్దులు, యువకులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు వడివాసల్ నుంచి ఆలయ ఎద్దు పరుగులు తీసాయి. అనంతరం వడివాసల్ నుంచి రంకెలు వేసుకుంటూ దూసుకొస్తున్న ఎద్దులను అదుపుచేసేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ క్రమంలో, పలువురు యువకులకు స్వల్పగాయాలవగా, ఆ ప్రాంతంలోని వైద్యశిబిరంలో వారికి చికిత్స అందించారు. ఈ పోటీల్లో అధిక ఎద్దులు అదుపు చేసిన యువకులు, వారికి అందకుండా పరుగులు తీసిన ఎద్దుల యజమానులకు పలు బహుమతులు అందజేశారు. ఈ పోటీలు తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలు, జిల్లాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

పాల ఉత్పత్తిదారులకు రూ.6000 కోట్ల రుణాలు



● మంత్రి రాజకన్నప్పన్

ప్యారీస్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆవిన్ సంస్థకు పాలు సరఫరా చేస్తున్న వారికి తక్కువ వడ్డీతో రూ.6000 కోట్లు రుణంగా అందజేయాలని ఉత్తర్వులు జారీచేసినట్లు పాడిపరిశ్రమల శాఖామంత్రి రాజకన్నప్పన్ పేర్కొన్నారు. అసెంబ్లీలో బుధవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలో ప్రస్తుతం పాల కొనుగోళ్లు తగ్గిందని, దీనిని పెంచేలా చర్యలు తీసుకోవాలని పాపిరెడ్డిపట్టి ఎమ్మెల్యే గోవిందస్వామి సూచించారు. ఇందుకు మంత్రి సమాధానమిస్తూ అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో 23 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేశారని, ప్రస్తుతం ఇది 34 లక్షల లీటర్లకు పెరిగిందన్నారు. వేసవి సీజన్‌లో సహజంగా పాల ఉత్పత్తి తక్కువగా వుంటుందని, మే, జూన్ నెలల్లో మరింత తగ్గే అవకాశముందన్నారు. అయినప్పటికీ రైతుల నుండి అదనంగా పాలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో లీటర్ పాలు రూ.56 కు విక్రయిస్తున్నారని, అయితే తమిళనాడులో రూ.40కే ప్రజలకు అందజేస్తున్నట్టు మంత్రి తెలిపారు. పాల ఉత్పత్తిదారుల కోరిక పరిశీలించి, వారికి రూ.6 వేల కోట్ల మేర రుణాలు మంజూరు చేసేలా ఉత్తర్వులిచ్చినట్లు తెలిపిన మంత్రి ఇందులో తొలిదశగా రూ.2 వేల కోట్లు ఈ వారంలోనే రైతు బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నట్లు ఆయన తెలియజేశారు.

రవాణా శాఖకు సీఎం స్టాలిన్ చేయూత

● మంత్రి శివశంకర్



ప్యారీస్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రవాణా శాఖను అభివృద్ధి పరిచేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వం తరుపున సహాయ సహకారాలు అందిస్తున్నారని మంత్రి శివశంకర్ పేర్కొన్నారు. అసెంబ్లీలో బుధవారం ఉదయం రవాణా శాఖకు సంబంధించి ప్రవేశపెట్టిన బిల్లుపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు పాల్గొన్నారు. వారడిగిన పలు ప్రశ్నలకు రవాణా శాఖామంత్రి ఎస్ఎస్ శివశంకర్ సమాధానం చెబుతూ, మహిళల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతోందని, మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకానికి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఈ నాలుగేళ్లలో ఇప్పటివరకు సుమారు 670 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని తెలిపారు. 67 మంది మహిళా కండక్టర్లను ఇటీవల రవాణా సంస్థలకు నియమించినట్లు వెల్లడించారు.. ప్రపంచ బ్యాంకు నిధుల సహాయంతో చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌కు కాంట్రాక్ట్ విధానంలో కొత్తగా కొనుగోలు చేసిన 600 బస్సులను అప్పగించినట్లు తెలిపారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో మరో 750 కొత్తబస్సులు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర రవాణా సంస్థలు ఇంధనం పొదుపు చేయాలన్న సంకల్పంతో వెయ్యి బస్సులను సీఎన్‌జీగా మార్చాలని నిర్ణయించామని తెలిపారు. నష్టాల ఊబిలో చిక్కుకున్న ప్రభుత్వ రవాణా శాఖను ఆదుకోవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి స్టాలిన్ కొత్త బస్సులు కొనుగోలు చేసేందుకు అనుమతులిచ్చి ఆదుకున్నారని మంత్రి సభలో తెలిపారు. వేతనం ఒప్పందానికి సంబంధించి రవాణా కార్మికుల సంఘాల ప్రతినిధులతో తొలిదశ చర్చలు ముగిశాయని, త్వరలోనే ఈ కార్మికుల కోరికలను నెరవేరుస్తామన్నారు. దేశంలోనే ప్రజా రవాణా వ్యవస్థలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న తమిళనాడు రవాణా సంస్థ 28 శాతం అవార్డులు దక్కించుకుని, రాష్ట్రానికి ఘనత చేకూర్చిందని మంత్రి శివశంకర్ తెలిపారు.

ఐ రిసెర్చ్ సెంటర్‌కు 'జెమ్ హాలిడే' రూ.12లక్షల విరాళం

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్‌కు అనుబంధంగా పనిచేస్తున్న ఐ రిసెర్చ్ సెంటర్‌కు జెమ్ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో ఒకటైన జెమ్ హాలిడే రిసార్ట్స్ సంస్థ రూ.12.48 లక్షలు విరాళంగా అందించింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఐ రిసెర్చ్ సెంటర్ అధ్యక్షుడు డాక్టర్ ఆదియా అగర్వాల్, కార్యదర్శి సుధ, జనరల్ మేనేజర్ సత్యబ్రాత్‌పతి, సీనియర్ మేనేజర్ అరుళ్ జి, జెమ్ సంస్థ ఎండీ ఎస్ఆర్ ఆసైతంబి తదితరులు పాల్గొన్నారు.


జెమ్ హాలిడే రిసార్ట్స్ అధ్యక్షుడు ఆసై తంబికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐ రిసెర్చి సెంటర్ నిర్వాహకులు

పునరుత్పాదక ఇంధనాలపై రీన్యూఎక్స్ 2025 ప్రదర్శన ప్రారంభం

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో పునరుత్పాదక ఇంధన తయారీ తదితర అంశాలపై రీన్యూఎక్స్ 2025 పేరుతో ఇన్‌ఫార్మా మార్కెట్స్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక ప్రదర్శన ప్రారంభమైంది. ఈ ప్రదర్శనలో 200లకు పైగా ప్రముఖ కంపెనీలు తమ పునరుత్పాదక ఇంధనాల ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయి. 50 మంది ప్రముఖులు పాల్గొని పునరుత్పాదక ఇంధనాల తయారీ, సాంకేతిక పరిజ్ఞానంపై ప్రసంగించనున్నారు. ఫ్రాస్ట్ అండ్ సుల్లివాన్ ఇండియా ఎనర్జీ , ఎన్విరాన్‌మెంట్ ప్రాక్టీస్ సంస్థ ఉపాధ్యక్షుడు అమోల్ కొత్వాల్, తమిళనాడు సోలార్ ఎనర్జీ డెవలపర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


రీన్యూఎక్స్ 2025 ప్రదర్శన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు



తిరుమలలో ప్రారంభమైన భాష్యకారుల ఉత్సవాలు

తిరుమల శ్రీవారి ఆలయంలో భాష్యకారుల ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. 19 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో మే 2న భాష్యకార్ల సాత్తుమొర ఉంటుంది. శ్రీరామానుజులవారు జన్మించిన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాదీ శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. మొదటిరోజున బుధవారం ఉదయం శ్రీరామానుజులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా జీయంగార్లు దివ్యప్రబంధ గోష్టి చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద, చిన్న జీయర్ స్వాములు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమల ఘాట్‌లో పల్టీకొట్టిన సుమో



● ఏడుగురికి గాయాలు

తిరుమల మొదటిఘాట్‌రోడ్డులో బుధవారం సుమో బోల్తాపడి ఏడుగురు భక్తులు గాయపడ్డారు. కర్ణాటకకు చెందిన ఓ భక్తబృందం శ్రీవారిని దర్శించుకుని బుధవారం ఉదయం వాహనంలో తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. 35వ మలుపు వద్ద సుమో అదుపుతప్పి బోల్తా పడింది. క్షతగాత్రులను తిరుపతిలో రుయాస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 6 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.61 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 61,828

తలనీలాలు సమర్పించినవారు: 21,165



సివిల్స్‌లో సాయి 'తేజ'స్సు



● కోచింగ్ లేకుండానే 154వ ర్యాంకు సాధన

నాయుడుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సాధించిన దానితో ఆ యువకుడు సంతృప్తి చెందలేదు. అనుకున్న లక్ష్యం కోసం పట్టుదలతో శ్రమించాడు. నిన్నటి సివిల్స్ ఫలితాల్లో 154వ ర్యాంకుతో మెరిశాడు నాయుడుపేట మండలం చిలమత్తూరుకు చెందిన నెల్లూరు సాయితేజ. ఈయన తండ్రి శ్రీనివాసులు చిల్లకూరు మండలం గమళ్ళదిబ్బలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, తల్లి సరస్వతి ఓజిలిలో హెల్త్ సూపర్‌వైజరుగా పనిచేస్తున్నారు. వీరు 20 ఏళ్ళ కిందట చిల్లకూరులో స్థిరపడ్డారు.

ఎలాంటి కోచింగూ పొందలేదు

సివిల్ సర్వీసెస్ కోసం ఎలాంటి కోచింగ్ ప్రత్యేకించి తీసుకోలేదు. అంతా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్‌తో ప్రిపేర్ అయ్యాను. ఐఎఫ్‌ఎస్‌కి ఎంపిక కావాలనేది నా లక్ష్యం. అందుకే గతేడాది సివిల్స్‌లో 558వ ర్యాంకు వచ్చినా మళ్లీ రాశాను. ఈసారి 154వ ర్యాంకు వచ్చింది. అమ్మానాన్న, కుటుంబ సభ్యులు ఈవిషయంలో బాగా ప్రోత్సహించారు.

- నెల్లూరు సాయితేజ, సివిల్స్ 154వ ర్యాంకర్

పట్టువదలని విక్రమార్కుడిలా..

సాయితేజ 1నుంచి 5వ తరగతి వరకు నాయుడుపేట మండలం గొట్టిప్రోలు ఎలిమెంటరీ పాఠశాలలో చదివారు. 6 నుంచి 10 వరకు చిల్లకూరు లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో, ఇంటర్మీడియట్ శ్రీచైతన్య(విజయవాడ)లో చదివారు. హైదరాబాదులో బీటెక్ చదివారు. సివిల్ సర్వీసెస్‌కు మంచి ర్యాంకుతో ఎంపిక కావాలని ధ్యేయంగా పెట్టుకున్నారు. ఇందుకోసం కష్టపడి ప్రిపేర్ అయ్యారు. కష్టం ఫలించి గతేడాది 558వ ర్యాంకు పొందారు. అయినప్పటికీ సాయితేజ సంతృప్తి చెందలేదు. పట్టుదల వదలని విక్రమార్కుడిలా ప్రయత్నాన్ని కొనసాగించారు. ఫలితంగా తాజాగా ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 154వ ర్యాంకు పొందారు. ఈయన భార్య జ్యోతిర్మయి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. తమ్ముడు నెల్లూరు విష్ణుతేజ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. సాయితేజకు సివిల్స్‌లో మెరుగైన ర్యాంకు వచ్చిందని తెలియగానే చిలమత్తూరులో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.



భార్య, తల్లిదండ్రులతో సాయితేజ

అనుకున్నది సాధించాడు

చిల్లకూరు, ఆంధ్రజ్యోతి: 'మా అబ్బాయి సాయితేజకు ఐఏఎస్ కావాలన్నది లక్ష్యం. గతేడాది 558వ ర్యాంకుతో ఐపీఎస్‌కు ఎంపికయ్యాడు. ఐఏఎస్ కావాలన్న పట్టుదలతో ఈసారి 154వ ర్యాంకుతో అనుకున్నది సాధించాడు' అని సాయితేజ తల్లిదండ్రులు నెల్లూరు శ్రీనివాసులు, సరస్వతి బుధవారం ఆనందం వ్యక్తంచేశారు. తమ కుమారుడు కొన్నేళ్లుగా బీహెచ్‌ఈఎల్ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నాడన్నారు. ఐఏఎస్‌గా పేదలకు న్యాయం చేయడమే అతడి ఉద్దేశ్యమని చెప్పారు.

రైల్లో చోరీ చేసి పారిపోతూ... గ్రామస్తులకు పట్టుబడ్డ నంద్యాలవాసి

● పోలీసులకు అప్పగించిన చెంగారెడ్డిపల్లెవాసులు



రైల్లో దొంగతనం చేసి గ్రామస్తులకు పట్టుబడిన దొంగ

రేణిగుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైల్లో దొంగతనం చేసి గ్రామస్తులకు పట్టుబడిన నిందితుడిని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన బుధవారం ఉదయం 2 గంటలకు తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని చెంగారెడ్డిపల్లెలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం అర్ధరాత్రి గూడూరు నుంచి తిరుపతికి వెళ్తున్న రైలులో బ్యాగును ప్రయాణికుడు చోరీ చేశాడు. బ్యాగుతో రేణిగుంట రైల్వేస్టేషన్ ఔటర్‌లో దిగి పారిపోయే క్రమంలో చెంగారెడ్డిపల్లెలోకి చేరుకున్నాడు. వీధి కుక్కలు పెద్ద ఎత్తున మొరగడంతో గ్రామస్తులు ఒక్కసారిగా మేల్కొన్నారు. దీంతో నిందితుడు ముళ్లపొదల్లో దాక్కున్నాడు. గ్రామస్తులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అతని ఆధార్ కార్డు ద్వారా నంద్యాలకు చెందిన హరీష్‌గా గుర్తించారు. చోరీ చేసిన బ్యాగ్‌ను పరిశీలించగా బంగారు నగలు ఉన్నట్టు గుర్తించారు. అయితే అవి రోల్డ్ గోల్డ్ అని తెలుసుకున్నారు. బంగారు నగలు అనుకుని ఆ బ్యాగ్‌ను చోరీ చేసి ఉంటాడని భావించారు. నెం.100కు ఫోన్ చేసి నిందితుడిని అర్బన్ పోలీసులకు అప్పగించారు. చోరీ జరిగింది రైలులో కావడంతో రైల్వే జీఆర్పీ పోలీసులకు నిందితుడిని అప్పగించారు. జీఆర్పీ ఎస్ఐ రవి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

'ఎంఎస్‌ఎంఈ' పార్కుల అభివృద్ధికి ప్రణాళిక

● ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేస్తాం

● ఉమ్మడి జిల్లా అధికారుల సమీక్షలో మంత్రి శ్రీనివాస్



కలెక్టరేట్‌లో అధికారులు, పరిశ్రమలతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలో అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు రాబోతున్నాయని, వాటి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎంఎస్‌ఎంఈ పార్కులతో అటు పారిశ్రామికాభివృద్ధి, ఇటు నిరుద్యోగ నిర్మూలనకు చర్యలు చేపడుతున్నామన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం చిత్తూరు ఉమ్మడి జిల్లా అధికారులతో పాటు ఎఫ్‌ఎస్‌ఎంఈ, ఫ్యాప్సియో, ఫుడ్ ప్రాసెసింగ్ అసోసియేషన్, టెక్స్‌టైల్ నగరి అసోసియేషన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఎంఎస్‌ఎంఈలో వృద్ధి సాధిస్తున్నామని వారి కోసం బెస్ట్ పాలసీ తీసుకొస్తామన్నారు. ఔత్సాహికులకు చేయూతనిచ్చి, ఉత్పత్తులను పెంచే దిశగా ఊతమివ్వడం ఉద్యోగ ఉపాధి అవకాశాలు మార్కెటింగ్ సదుపాయాల పెంపు కోసం కృషి చేస్తుందన్నారు. తిరుపతి, చిత్తూరులో పరిశ్రమల అభివృద్ధికి చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. ఎంఎస్‌ఎంఈ పాలసీని తీసుకువచ్చి సింగిల్‌విండో పద్ధతిన అన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం సూచించిన ప్రణాళికల ఆధారంగా కృషి చేస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల వారు తీసుకునే రుణాలను జీవనోపాధి వైపు మళ్లించి వ్యాపారవేత్తలుగా తయారుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యమన్నారు. అంతకు ముందు పరిశ్రమల అసోసియేషన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అనేక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు ఎంఎస్‌ఎంఈ, ఉమ్మడి జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఆక్సిజన్ పరిశ్రమకు భూమిపూజ

పరిశ్రమల ప్రతినిధులతో మంత్రి కొండపల్లి సమావేశం



వరదయ్యపాళెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో ఎంఎస్‌ఎంఈ కేటగిరికి చెందిన 'గుప్తా ఆక్సిజన్ ప్రైవేటు లిమిటెడ్‌'కు బుధవారం రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్ఐ సాధికారత, సంబంధాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ భూమిపూజ చేశారు. రూ.40కోట్లతో నిర్మిస్తున్న ఈ పరిశ్రమ 2025 అక్టోబరు నాటికి ఉత్పత్తులు ప్రారంభించనుంది. డ్యూ గ్యాస్ పేరిట పారిశ్రామిక గ్యాస్‌ను ఇది ఉత్పత్తి చేస్తుంది. ఏపీ ఆటోమేటిక్ రంగాలకు గ్యాస్ సరఫరా చేయనుంది. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, ఆసంస్థ ఎండీ, సీఈవో ఆనంద గుప్తా తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి శ్రీసిటీ పరిసరాల్లో పర్యటించారు. ఎవర్టన్ టీ పరిశ్రమను సందర్శించారు. 90శాతం పైగా స్థానిక గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్‌ఎంఈ పరిశ్రమ, మహిళా సాధికారత, సమ్మిళిత వృద్ధికి చక్కని నమూనాగా కొనియాడారు. తన పర్యటనలో భాగంగా ఆయన శ్రీసిటీ పరిశ్రమల సీఈవోలతో సమావేశమయ్యారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుకు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృషి చేస్తున్నట్లు ఆయన అభినందించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో పీ4 విజన్ పయనం సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ఏపీకే రెడ్డి, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు హాజరయ్యారు. వారితో పాటు ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలత్తూరులో 80 పరిశ్రమలకు భూముల కేటాయింపు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆంధ్రజ్యోతి: బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఆలత్తూరు ఏపీఐఐసీలో 80 పరిశ్రమలకు భూములు కేటాయించినట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆలత్తూరులో ఏపీఐఐసీ భూములను బుధవారం ఆయన పరిశీలించారు. భూముల రికార్డులను అధికారులు మంత్రికి వివరించారు.

జిల్లాలో ఐదుగురు సీఐల బదిలీ

● వీఆర్‌లో ఉన్న ఇద్దరికి పోస్టింగ్

● ఈస్ట్‌కు శ్రీనివాసులు నియామకం



సీఐ శ్రీనివాసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బదిలీ అయిన వారిలో తిరుపతి వెస్ట్‌లో పనిచేస్తున్న రామకృష్ణను సోషల్ మీడియా విభాగానికి నియమించారు. ఈస్ట్ సీఐగా పనిచేస్తున్న జగదీష్‌ను అనంతపురం పీటీసీకి.. జిల్లా ఎస్పీ వీఆర్‌లో ఉన్న మద్దయ్యాచ్చారిని తిరుమల స్పెషల్ బ్రాంచ్‌కు, తిరుపతిలో సోషల్ మీడియాలో సీఐగా పనిచేస్తున్న ఇమ్రాన్ బాషాను భాకరాపేటకు, వీఆర్‌లో ఉన్న కె.శ్రీనివాసులును తిరుపతి ఈస్ట్‌కు నియమించారు. వెస్ట్ పీఎస్‌లో అటాచ్‌మెంటులో సీఐగా పనిచేస్తున్న మురళీమోహన్‌ను అక్కడే రెగ్యులర్ సీఐగా నియమించారు. వీరందరూ తక్షణం వారి వారి స్థానాల్లో బాధ్యతలు తీసుకోవాలని డీఐజీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తిరుపతిలో బాలికపై అత్యాచారం

● పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బాలికపై ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ మేరకు బుధవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి నగరానికి చెందిన 16 ఏళ్ల బాలికకు చెర్లోపల్లెకు చెందిన రవికుమార్‌తో పరిచయం వుంది. ఇతను ఫ్లోరింగ్ టైల్స్ పనులు చేస్తున్నాడు. ఇతని స్నేహితులు సింగాలకుంటకు చెందిన సాయికుమార్ ఫోటో ఫ్రేమ్ వర్కు చేస్తున్నాడు. ఈ నెల 17న ఆ బాలిక సాయికుమార్‌తో కలిసి వెళ్లింది. ఇంట్లో కనిపించకపోవడంతో తల్లితండ్రులు వెస్ట్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, చెర్లోపల్లె వద్ద గది తీసుకున్న ముగ్గురు ఆ బాలికపై అత్యాచారం చేసినట్లు బుధవారం బాధితులు ఫిర్యాదు చేయడంతో సీఐ మురళీమోహన్ వెంటనే కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై విచారిస్తున్నారు. ఈ ఘటనలో సాయికుమార్ స్నేహితుడు ప్రకాశం జిల్లాకు చెందిన రవి సైతం పాల్గొన్నట్లు రుజువు కావడంతో అతడిపైనా కేసు నమోదు చేశారు.

శ్రీనివాస సముదాయంలో క్రీడా వేదికలు ప్రారంభం

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో పలు క్రీడా వేదికలను రవాణా, యువజన క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పికిల్ బాల్, బాస్కెట్ బాల్, రైఫిల్ షూటింగ్ ఆడుతూ కాసేపు సరదాగా గడిపారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర దాడుల్లో మృతిచెందిన పర్యాటకుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. దక్షిణాదిన ఎక్కడా లేని విధంగా అత్యాధునిక సౌకర్యాలతో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసినట్లు మంత్రి చెప్పారు. పేద క్రీడాకారులు ఒలంపిక్స్, ఏషియన్ గేమ్స్‌లో పాల్గొనడానికి వీలుగా ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను 2నుంచి 3శాతానికి పెంచిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదేనన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్మార్ట్‌సిటీ నిధులతో ఇందిరా మైదానంలో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీన, ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం ప్రారంభించామన్నారు. గొల్లవానిగుంటలో నిర్మాణ దశలో ఆగిపోయిన క్రికెట్ స్టేడియాన్ని త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు మాట్లాడుతూ తిరుపతిని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి చర్యలు ప్రారంభించామన్నారు. టీటీడీ కేటాయించిన రూ.కోటి నిధులతో సముదాయంలో మరిన్ని మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. గుంటూరుకు చెందిన హాట్రిక్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రొప్రయిటర్ అండ్ బ్రదర్స్ శ్రీరామ్ క్రీడాకారుల ప్రయోజనార్థం రూ.2 లక్షలతో క్రీడా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, టీటీడీ బోర్డు సభ్యుడు పనబాకలక్ష్మి, మహిళా వర్సిటీ వీసీ ఉమ, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్‌వర్మ, మహేష్‌యాదవ్, ఊకా విజయ్‌కుమార్, వరప్రసాద్, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, దాతలు ప్రణీత్, వై.ప్రవీణ్, శ్రీధర్, క్రీడా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంలో రైఫిల్ షూటింగ్ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి, శాప్ చైర్మన్ రవినాయుడు, నాయకులు

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ10లక్షల విరాళం



తిరుపతి, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి) : టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు గుండివాడకు చెందిన ఎన్‌ఆర్ఐ చల్లగుల్ల సాయిరాజ తరఫున ఆయన తండ్రి ప్రసాద్ రూ.10లక్షలు విరాళంగా అందజేశారు. బుధవారం ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి వచ్చిన టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మికి ప్రసాద్ విరాళం మొత్తాన్ని డీడీ రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ పాల్గొన్నారు.

స్వల్పంగా ధర తగ్గిన బంగారం

● కాస్త పెరిగిన కొనుగోళ్లు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బంగారం ధరలు స్వల్పంగా తగ్గడంతో తిరుపతిలోని కొన్ని కార్పొరేట్ స్థాయి దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి కనిపించింది. అదే పెద్ద, చిన్న దుకాణాలు వెలవెలపోతున్నాయి. నిన్నటి వరకు 22 క్యారెట్ల బంగారం గ్రాము 10,200 వరకు పలికింది. అదే బుధవారం మధ్యాహ్నానికి గ్రాముపై రూ 300 తగ్గి రూ.9900 వరకు చేరింది. అదే 24 క్యారెట్ల బంగారం గ్రాము 10,250 నుంచి 9900కు వచ్చింది. దీంతో పెళ్లిళ్ల, ఇతర అవసరాల నిమిత్తం పలువురు బంగారం కొనేందుకు ఆసక్తి చూపారు. తిరుపతి బాలాజీ కాలనీలోని కొన్ని బంగారు దుకాణాల వద్ద బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కొంత సందడిగా కనిపించింది. అదే బజారు వీధిలోని దుకాణాల వద్ద ఎవరూ లేరు. నగరంలో తిరుపతిలో చిన్నా చితక దుకాణాలు దాదాపు 550 వరకు వున్నాయి. అదే కార్పొరేట్ స్థాయి షాపులు దాదాపు 12 వరకు వున్నాయి. వీటిల్లో రోజుకు గతంలో అయితే రూ ఆరు కోట్లు నుంచి 8 కోట్లు వరకు వ్యాపారం జరిగేదని ప్రస్తుతం బంగారం ధరలు బాగా పెరగడంతో రోజుకు రూ.మూడు కోట్ల వ్యాపారం కూడా జరగడం లేదని దుకాణాల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'ఇప్పుడు గ్రాము బంగారంపై రూ.300 మాత్రమే తగ్గింది. ఇది స్థిరంగా ఉండే అవకాశాల్లేవు. పరిస్థితులను బట్టి రానున్న ఆరు నెలల కాలంలో మరింత పెరిగే అవకాశాలున్నాయి' అని బంగారు దుకాణాల సంఘం అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ అన్నారు. కాగా, వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నేతలు

ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన పర్యాటకులకు కొవ్వొత్తుల నివాళి

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన పర్యాటకులకు బుధవారం తిరుపతిలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కృష్ణాపురం ఠాణా నుంచి నాలుగుకాళ్ల మండపం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అంతకుముందు ఎన్జీవో కాలనీలోని తన కార్యాలయంలో జనసేన పార్టీ జెండాను ఎమ్మెల్యే శ్రీనివాసులు అవనతం చేశారు. కార్యక్రమంలో నరసింహులునాయుడు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, సుభాషిణి, బాబ్జి, రాజేష్ ఆచారి, దినేష్‌జైన్, బాలిశెట్టి కిషోర్, లక్ష్మీపతి, మునస్వామి, హేమంత్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, శిరీష, అక్బర్ పాల్గొన్నారు.

బియ్యం స్టాక్‌లేదు.. డబ్బులిస్తాం తీసుకోండి!

● ఎండీయూ ఆపరేటర్ల నిర్వాకం ● కార్డుదారులకు అందని బియ్యం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల బియ్యం స్టాక్ తక్కువగా వచ్చింది.. బియ్యానికి బదులుగా డబ్బులిస్తాం తీసుకోండి.. అంటూ ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, డీలర్లు కార్డుదారులను కోరుతున్నారు. తమకు బియ్యమే కావాలని కార్డుదారులు చెప్పినా వినకుండా వేలిముద్ర వేసి చక్కెర, కందిపప్పు తీసుకుని వెళ్లిపోండని ఒత్తిడి చేస్తున్నారు. ఏప్రిల్ నెల పూర్తికావస్తున్నా సూళ్లూరుపేట పట్టణంలో నేటికీ పూర్తిస్థాయిలో రేషన్ బియ్యం పంపిణీ జరగలేదు. రేషన్ షాపుల వద్దకు వెళితే... మాకు సంబంధం లేదు.. ఎండీయూ వాహనాలు వస్తాయి.. అక్కడే తీసుకోండి.. అంటూ ముప్పతిప్పలు పెడుతున్నారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో మొత్తం 121 చౌక దుకాణాల పరిధిలో 47,032 రేషన్ కార్డులున్నాయి. వీరికి నెలనెలా 680 టన్నుల బియ్యం సరఫరా చేస్తారు. మూడు మండలాల్లో జనవరిలో 60శాతం, ఫిబ్రవరిలో 60శాతం, మార్చిలో 70శాతం బియ్యం పంపిణీ జరిగినట్లు రికార్డుల్లో నమోదైంది. మిగిలిన స్టాక్ నిల్వ కింద చూపి తదుపరి నెలకు కేటాయింపులు జరుగుతాయి. ఏప్రిల్ నెలకు డీలర్ల వద్ద స్టాక్ నిల్వలు ఉన్నట్లు రికార్డులు చూపిస్తుండడంతో దాదాపు 30 టన్నుల కోత పడినట్లు అధికారులు చెబుతున్నారు. వచ్చిన బియ్యాన్ని కూడా సక్రమంగా అందించకపోవడంతో కార్డుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సూళ్లూరుపేటకు రెగ్యులర్ సీఎస్ డీటీ లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ప్రజా పంపిణీ వ్యవస్థపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డీలర్లు, ఎండీయూ వాహనాల ఆపరేటర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

సక్రమంగా బియ్యం పంపిణీ చేసేలా చూస్తాం

ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, డీలర్లు సక్రమంగా బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం. కార్డుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే బియ్యం అందేలా చూస్తాం, త్వరలోనే డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను చక్కదిద్దుతాం.

- తహసీల్దార్ నరసింహారావు